# నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, శనివారం 21 సెప్టెంబర్ 2024 SANGAREDDY




శుక్రవారం వర్షంలో తడుస్తూ మల్లన్నసాగర్‌ను సందర్శిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి



మల్లన్నసాగర్ సందర్శనానికి వెళ్తూ ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

## సైంటిస్టుల జాబితాలో ఐఐటీహెచ్ అధ్యాపకులు

కంది, సెప్టెంబర్ 20 : ఐఐటీ హైదరాబాద్‌లోని 23 మంది అధ్యాపకులు స్టాన్‌ఫోర్డ్ ప్రపంచంలోని టాప్ 2శాతం సైంటిస్టుల జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఐఐటీహెచ్ ప్రెస్‌నోట్‌ను విడుదల చేసింది. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎల్సెవియర్‌లు విడుదల చేసిన 2శాతం శాస్త్రవేత్తల జాబితాలో వీరికి చోటు దక్కడంపై ఐఐటీహెచ్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డితోపాటు పలువురు అభినందించారు. అధ్యాపకులు అత్యుత్తమైన నాణ్యత గల పరిశోధనల ప్రదర్శన, కెరీర్-లాంగ్ రీసెర్చ్ (11 ఫ్యాక ల్టీ), 2023లో చేసిన పరిశోధన (23 ఫ్యాకల్టీ) ఆధారంగా ఈ జాబితాను రెండు వర్గాలుగా విభజించారు. ఈ ప్రతిష్టాత్మక జాబితా ప్రపంచంలోని ప్రముఖ పరిశోధకులుగా గుర్తిపునిస్తుంది.



సుతారిపల్లిలో గ్రామస్తులు, బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

## రైతు ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి

**మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి**

రామాయంపేట, సెప్టెంబర్ 20: మెదక్ జిల్లా రామాయంపేట మండలం సుతారిపల్లికి చెందిన రైతు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు పున్న స్వామి ఆత్మహత్యకు కారకులైన వారిని చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సుతారిపల్లిలో బాధిత కుటుంబాన్ని శుక్రవారం ఆమె పరామర్శించి గ్రామస్తులతో మాట్లాడారు. ఓవ్యక్తి ఆత్మహత్యకు ప్రేరేపించిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయకుండా జాప్యం చేయడం మంచిది కాదన్నారు. వెంటనే ఆ ఇద్దరు వ్యక్తులను బేషరతుగా అరెస్టు చేసి జైలుకు పంపాలని పోలీసులను ఆమె డిమాండ్ చేశారు. గతంలో జరిగిన సంఘటనలకు ఒక న్యాయం, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో న్యాయమా అని పోలీసులను ఆమె ప్రశ్నించారు. ఆ ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించకుంటే తాము రోడ్డెక్కుతామని రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్‌ను ఫోన్‌లో ఆమె హెచ్చరించారు. తనకు ప్రాణభయం ఉందని పున్న స్వామి సెల్ఫీ వీడియోలో మాట్లాడినా ఇంతవరకు వారిపై చర్యలు తీసుకోకపోవడం తగదన్నారు. బాధిత కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని పద్మాదేవేందర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. దశాబ్ద కాలంగా బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడిగా పార్టీకి స్వామి అందించిన సేవలు మరిచిపోమన్నారు. ఆమె వెంట రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, మాజీ ఎంపీటీసీ పున్న వెంకట స్వామి, బాలయ్య, మాజీ సర్పంచ్ సంధ్య, మహేశ్, సుభాశ్ తదితరులు ఉన్నారు.





## ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్







సిద్దిపేట పట్టణంలో ప్రభుత్వ దవాఖాన వైపు వెళ్లే రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్ హోల్స్ దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. ఈ రోడ్డు గుండా వెళ్లాలంటే వాహనచోదకులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థినులు ప్రమాదాల బారిన పడతామని భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ సిబ్బంది స్పందించి వాటికి మరమ్మతులు చేసి ఇబ్బందులు తొలిగించాలని ప్రజలు కోరుతున్నారు.

– సిద్దిపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సెప్టెంబర్ 20

# మల్లన్నసాగర్‌ను అడ్డుకున్న కాంగ్రెస్

## కోర్టుల్లో కేసులు వేసి రిజర్వాయర్ నిర్మాణానికి అడ్డు తగలారు

- పంటలు పండడం కాంగ్రెస్ నేతలకు ఇష్టం లేదు..?
- కేసీఆర్ కట్టించిన ప్రాజెక్టులోకి 21 టీఎంసీల నీళ్లు వచ్చాయి..
- నీళ్లను చూస్తుంటే కాంగ్రెస్ నేతలకు కండ్లు మండుతున్నాయి..
- కేసీఆర్ కల ఫలించింది...చాలా సంతోషంగా ఉంది..
- మిగిలిన 10శాతం కాల్వల పనులు ఈ సర్కారు పూర్తిచేయాలి
- వెంటనే రిజర్వాయర్లలో చేపపిల్లలు విడుదల చేయాలి
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులతో కలిసి మల్లన్నసాగర్ సందర్శన
- గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన నేతలు
- పర్యటనను అడ్డుకోవడానికి అత్యుత్సాహం చూపిన పోలీసులు



మల్లన్నసాగర్ వద్ద గంగమ్మతల్లికి పూలుచల్లి పూజలు చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి, నాయకులు

సిద్దిపేట ప్రతినిధి/తొగుట,సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ) :'ఆనాడు మల్లన్నసాగర్ ప్రాజెక్టు కట్టేటప్పుడు అడ్డం పడ్డారు.. కోర్టుల్లో కేసులు వేసిండ్రు..సంతోషాన్ని పంచుకుందామని వస్తే ఇవ్వాళ కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు'..అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఈ నీళ్లతోని మెదక్, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో పంటలు పండడం కాంగ్రెస్ నేతలకు ఇష్టం లేదా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతుల పొలాలు తడవడం మీకు ఇష్టం లేదా అని నిలదీశారు. కేసీఆర్ కట్టించిన మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీల నీళ్లు వచ్చాయని తాము పసుపు కుంకుమ వేసి గోదావరి జలాలకు దండం పెట్టుకుందామని వచ్చామన్నారు. దానిని కూడా అడ్డుకోవడమేనా..? అని ప్రశ్నించారు. ఏది ఏమైనా కేసీఆర్ కల ఫలించిందని, ఉత్తర తెలంగాణ వరప్రదాయిని మల్లన్నసాగర్ రిజర్వాయర్‌లోకి తొలిసారిగా 21 టీఎంసీలతో సముద్రాన్ని తలపిస్తున్నదన్నారు. శుక్రవారం ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలతో కలిసి మల్లన్నసాగర్‌ను హరీశ్‌రావు సందర్శించారు. గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ..కాళేశ్వరం ప్రాజెక్టు కొట్టుకుపోతే ఈ మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీల నీళ్లు ఎక్కడి నుంచి వచ్చాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.తొలిసారి మల్లన్నసాగర్‌లో 21 టీఎంసీల నీటిని నింపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. మల్లన్నసాగర్ పూర్తి అయ్యిందని, కాల్వలు 90 శాతం మేర బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిచేసిందని చెప్పారు. కాంగ్రెస్ నాయకులు మిగతా 10శాతం కాల్వలను భూమి సేకరించి వెంటనే పూర్తి చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అవుతున్నదని, స్పెషల్ ప్యాకేజీ తెచ్చి పనులు పూర్తి చేయాలన్నారు. దీని గురించి అసెంబ్లీలో అడుగుతామన్నారు. ఈ యాసంగి పంటకు ఢోకా లేదని, నాలుగు జిల్లాలకు యాసంగి సాగుకు నీళ్లు రాబోతున్నాయని హరీశ్‌రావు తెలిపారు. చెరువుల్లో నీళ్లు నిండుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్, టీడీపీ పాలనలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చుక్క నీరు ఇవ్వలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ కృషితో కాళేశ్వరం ప్రాజెక్టు ఆధారంగా అనేక రిజర్వాయర్లు నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. గతేడాది ఆగస్టులోనే అన్ని రిజర్వాయర్లు, చెరువుల్లో చేప పిల్లలను వేశామన్నారు. ఈసారి సెప్టెంబర్ 20 దాటినా కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చేపపిల్లలను వదలడం లేదన్నారు. కేసీఆర్ కృషితో చెరువులు అభివృద్ధి చేసుకున్నామని, మత్స్యకారులు, ముదిరాజ్‌లు చేపలు పెంచి జీవిస్తున్నారన్నారు. కేసీఆర్ చెరువులను ప్రాజెక్టులతో అనుసంధానం చేశారన్నారు. కాలం కాకపోయినా ప్రాజెక్టుల ద్వారా చెరువులు నింపే అవకాశాన్ని కేసీఆర్ కల్పించారన్నారు. అన్ని చెరువులు, రిజర్వాయర్లలో చేప పిల్లలను వదిలి ముదిరాజ్‌లు, మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాగా, మల్లన్నసాగర్ రిజర్వాయర్ సందర్శనకు వచ్చిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకుల పర్యటనకు పోలీసులు అడుగడుగునా అడ్డుతగిలారు. కార్యకర్తలపై, మీడియా ప్రతినిధులపై గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి రాయలేని భాషలో దుర్భాషలాడారు. బీఆర్‌ఎస్ బృందం పర్యటనలో ఆద్యంతం ఆటంకాలు సృష్టించారు. తిరుగు ప్రయాణంలో మల్లన్నసాగర్ కట్ట పైన కనీసం ట్రాఫిక్‌ను కూడా క్లియర్ చేయలేదు.

### తెలంగాణ ప్రజల గుండెల్లో నిలిచిన కేసీఆర్

**ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్**



పారే గోదావరి జలాల్లో, తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ కొలువై ఉన్నారు. ఆయన కీర్తిని చెరిపి వేయడం ఎవరికీ సాధ్యం కాదు. ప్రాజెక్టు నీళ్లతో పండే పంటలో, కూడవెల్లి హల్దీ వాగులో పారే నీళ్లలో కేసీఆర్ ఉన్నాడు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజల నుంచి కేసీఆర్‌ను వేరు చేయలేరు. తొలిసారి మల్లన్నసాగర్‌లోకి 21 టీఎంసీల జలాలు నింపుకోవడం చాలా సంతోషం.

### పిల్ల కాలువలు పూర్తి చేయండి

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి**



కేసీఆర్ హయాంలో ప్రాజెక్టులు పూర్తి చేసుకొని సాగునీళ్లు తెచ్చుకున్నాం. కాంగ్రెస్ నాయకులు కనీసం పిల్ల కాలువలు కూడా పూర్తి చేయడం లేదు. బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులోకి పూజలు చేసుకోవడానికి వస్తే అడ్డుకుంటారా. ఎవరెన్ని కుట్రలు చేసినా ప్రాజెక్టులు, నీళ్లు అంటేనే కేసీఆర్ అని ప్రజలకు తెలుసు. తెలంగాణ సాధించుకున్నదే సాగునీళ్ల కోసం. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రాజెక్టుల కట్టుకున్న ఘనత తెలంగాణ సొంతం. రైతుల మీద ప్రేమ, అభివృద్ధి చేయాలనే చిత్తశుద్ధి ఉంటే మిగిలిన కాలువలు కాంగ్రెసోళ్లు పూర్తిచేయాలి.

### మాయమాటలు తేలిపోయాయి

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి**



కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని కాంగ్రెస్ నాయకుల దుష్ప్రచారం చేశారు. ఇవ్వాళ మల్లన్నసాగర్‌లోకి వచ్చిన గోదావరి నీళ్లతోనే కాళేశ్వరం ప్రాజెక్టు ఘనత ఏమిటో తెలిసిపోయింది. ప్రాజెక్టుల మూలంగా నర్సాపూర్ నియోజకవర్గంలోకి గోదావరి నీళ్లు వస్తున్నాయి. కేసీఆర్ కట్టించిన అన్నపూర్ణ, రంగనాయక, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లు నిండుకుండలా మారాయి. రిజర్వాయర్లలో గోదావరి జలాలను నింపుకోవడం చాలా సంతోషంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంత మంది ఇప్పటికీ దుష్ప్రచారం చేస్తున్నారు. నీళ్లు తెచ్చిన కేసీఆర్, హరీశ్‌రావుకు కృతజ్ఞతలు.

### రైతు హితమే కేసీఆర్ ధ్యేయం

**ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి**



ప్రతిక్షణం రైతు హితమే ధ్యేయంగా కేసీఆర్ పనిచేశారు. ప్రాజెక్టుల్లో అవినీతి జరిగిందని అబద్ధపు ప్రచారం చేసిన కాంగ్రెస్ నాయకులకు మల్లన్నసాగర్‌లో నిండిన నీళ్లే సమాధానం చెబుతాయి. ఎంత సేపు కాంగ్రెస్ పార్టీ నేతలు రాజకీయాలు చేయడం తప్పా మరోటి లేదు. కేసీఆర్ రైతుల గురించి ఆలోచన చేయడం వల్లనే ఇవ్వాళ ఇక్కడ గోదావరి నీళ్లు మనకు కనిపిస్తున్నాయి.



మల్లన్నసాగర్ సందర్శనకు మాజీమంత్రి హరీశ్‌రావుతో కలిసి భారీగా తరలివచ్చిన ప్రజలు



శుక్రవారం మల్లన్నసాగర్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మాజీమంత్రి హరీశ్‌రావు, పక్కన ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, వెంకట్రామిరెడ్డి

# డిప్యుటేషన్లతో ప్రభుత్వ బడుల మూత

- మునిపల్లి మండలం నుంచి ఇష్టానుసారంగా ఇతర మండలాలకు టీచర్ల డిప్యుటేషన్లు
- పోస్టు శాంక్షన్ లేకున్నా...అక్కడికి డిప్యుటేషన్లు
- గార్లపల్లి, చీలపల్లి పాఠశాలల్లో ఏడు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయుడు
- ఈ ఏడాది మూతబడిన మన్‌సాన్‌పల్లి, ఖమ్మంపల్లి బడులు





సంగారెడ్డి జిల్లా మునిపల్లి ఎంఈవో కార్యాలయం

మునిపల్లి, సెప్టెంబర్ 20: సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలో సర్కారు విద్య బలహీనమవుతున్నది. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మండలంలోని పాఠశాలలు ఒక్కొక్కటిగా మూతబడుతున్నాయి. అధికారులు ఇష్టారీతిగా డిప్యుటేషన్లు వేస్తుండడంతో టీచర్ల కొరత వేధిస్తున్నది. దీంతో చాలా గ్రామాల్లో పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ఏటా విద్యార్థుల సంఖ్య తగ్గుతున్నది. ఇప్పటికే మండలంలో రెండు పాఠశాలలు మూతపడ్డాయి. మన్‌సాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గతేడాది 30మంది విద్యార్థులు,ఒక టీచర్ ఉండే వారు.ఆ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు సెలవుపై విదేశాలకు వెళ్లింది.ఆమెకు సెలవు మంజూరు చేసిన అధికారులు అక్కడ మరో ఉపాధ్యాయుడిని పంపించక పోవడంతో ఆ పాఠశాలను మూసివేశారు. ఖమ్మంపల్లి ఉర్దూ మీడియం పాఠశాల ఉపాధ్యాయురాలు సెలవులో వెళ్లగా, మరో ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో ఆ పాఠశాల పిల్లలు మరో పాఠశాలకి వెళ్లడంతో ఖమ్మంపల్లి ఊర్దూ మీడియం పాఠశాల మూతపడింది.ఇవేకాకుండా మండలంలోని మరికొన్ని పాఠశాలలు మూసివేసే పరిస్థితి ఉన్నాయి. గార్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మొత్తం ఏడుగురు ఉపాధ్యాయులు ఉండాలి. బదిలీలకు ముందు ఆరుగురు ఉపాధ్యాయులు గార్లపల్లి పాఠశాల్లో విధులు నిర్వహించే వారు. బదిలీల్లో ఈ పాఠశాల నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు ఇతర పాఠశాలలకు వెళ్లిపోయారు. వీరి స్థానంలో వేరే ఉపాధ్యాయులు రాకముందే ఇక్కడి టీచర్లను రిలీవ్ చేయడంతో ప్రస్తుతం ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే పాఠశాలకు వచ్చారు. ఇక్కడికి కొత్తగా వచ్చిన ఆ ముగ్గురిలో నుంచి ఒక ఉపాధ్యాయుడిని వేరే మండలానికి డిప్యుటేషన్‌పై పంపారు. దీంతో ప్రస్తుతం గార్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఏడు తరగతులకు ఒక్కరే ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. చీలపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఒక్కరే రావడంతో ప్రస్తుతం చీలపల్లి పాఠశాలలో ఏడు తరగతులకు ఒక్కరే పాఠాలు బోధిస్తున్నారు.

**డిప్యుటేషన్‌లో అధికారుల ఇష్టారాజ్యం...**

మూడేండ్లుగా మునిపల్లి మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటు విషయంలో అధికారులు నిబంధనలు విరుద్ధంగా వ్యవహరిస్తుండడంతో టీచర్లు లేక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేటప్పుడు ఒక మండలానికి సంబంధించిన ఉపాధ్యాయులని అదే మండలంలో అవసరమైన చోట సర్దుబాటు చేయాలి. కానీ, మునిపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను ఎంఈవో, డీఈవోతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా డిప్యుటేషన్ల పేరుతో జిల్లాలోని ఇతర మండలాలకు పంపించారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. గతేడాది మునిపల్లి మండలం నుంచి పది మందికి పైగా ఉపాధ్యాయులను ఇతర మండలాలకు డిప్యుటేషన్‌పై వెళ్లినట్లు సమాచారం. దీంతో మండలంలో సర్కారు పాఠశాలలు నిర్వీర్యం అవుతున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆ బడుల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని కొన్ని ఉపాధ్యాయ పోస్టులను బ్లాక్ చేయడంతో బదిలీల్లో కొత్త ఉపాధ్యాయులు ఆ పాఠశాలలకు రాలేక పోయారు. దీంతో చీలపల్లి, గార్లపల్లి, ఖమ్మంపల్లి, అంతారం, పోల్కంపల్లి, తాటిపల్లి, మునిపల్లి, పెద్దచెల్మడ, చిన్న చెల్మెడ, పెద్దగోపులారం, కంకోల్, మేళసంగం, లోని కాలనీలతో పాటు మరికొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు తగ్గాయి. మునిపల్లి మండలంలో ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఖమ్మంపల్లి ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులు లేక మూతబడింది. చీలపల్లి, పిల్లోడి, పోల్కంపల్లి పాఠశాలల్లో ఏడు తరగతులకు బదులు 5వ తరగతి వరకు మాత్రమే తరగతులు కొనసాగుతున్నాయి. ఈ పాఠశాలల్లో ఆరు, ఏడు తరగతులు కుదించారు. బుసారెడ్డిపల్లి, గార్లపల్లి, పెద్ద చెల్మెడ, బుధేరా పాఠశాలల్లో మాత్రమే 7వ తరగతి వరకు తరగతులు కొనసాగుతున్నాయి..

### డీఈవో ఆదేశాల ప్రకారమే..

మునిపల్లి మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించే ఉపాధ్యాయులు ఇతర మండలాలకు డిప్యుటేషన్‌పై వెళ్లిన విషయం వాస్తవమే. మండలం నుంచి నాకు తెలియకుండానే డీఈవో అనుమతితో డిప్యుటేషన్‌పై ఇతర మండలాలకు ఉపాధ్యాయులు వెళ్లిపోతున్నారు. పైఅధికారుల ఆదేశాలను మేము అమలు చేయాల్సిందే. సరిపడా టీచర్లు లేక విద్యార్థులకు సరైన చదువు అందించలేకపోతున్నాం. కలెక్టర్ మేడం స్పందించి మునిపల్లి మండలం నుంచి ఇతర మండలాలకు డిప్యుటేషన్లపై వెళ్లిన ఉపాధ్యాయులను తిరిగి మునిపల్లి మండలానికి పంపించేలా చర్యలు తీసుకోవాలి.

– దశరథ్, ఎంఈవో, మునిపల్లి

# అన్నింటా రేవంత్ సర్కారు విఫలం

- ఆంధ్రాలో మొదటి నెలలోనే రూ.4 వేల పింఛన్ పంపిణీ
- తెలంగాణలో పది నెలలు గడుస్తున్నా పింఛన్ పత్తాలేదు..
- వానకాలం పూర్తవుతున్నా రైతుభరోసా ఇవ్వడం లేదు..
- కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ రద్దుచేశారు..
- కాంగ్రెసోళ్లకు మాటలు ఎక్కువ.. పనులు తక్కువ
- మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- దుబ్బాకలో గణనాథులను దర్శించుకున్న ఎమ్మెల్యేలు



దుబ్బాకలో కత్తి కార్తిక ఫౌండేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి , సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక,సెప్టెంబర్ 20: అభివృద్ధి, సంక్షేమమే కాకుండా అన్నిరంగాల్లో రేవంత్ సర్కారు పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. పక్కనే ఉన్న ఆంధ్రాలో గెలిచిన మొదటి నెలలోనే అక్కడి సర్కారు రూ.4 వేల పింఛన్ ఇస్తే... ఇక్కడ గెలిచి పది నెలలు గడుస్తున్నా రూ.4 వేలు పింఛన్ ఇవ్వడం లేదని కాంగ్రెస్ సర్కారు తీరును ఆయన దుయ్యబట్టారు. దుబ్బాకలో యువజన సంఘాల గణనాథ మండపాలను శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హరీశ్‌రావు దర్శించుకున్నారు. దుబ్బాకలో బీఆర్‌ఎస్ నాయకురాలు కత్తి కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కత్తి కార్తీక సొంత డబ్బులతో మా ఇంటి మహాలక్ష్మి కార్యక్రమాన్ని హరీశ్‌రావు ప్రారంభించారు. నిరుపేద గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ...రక్తహీనత సమస్యతో బాధపడుతున్న పేద గర్భిణుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ న్యూట్రీషిన్ కిట్ ప్రారంభించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దానిని రద్దు చేసిందన్నారు. కేసీఆర్ కిట్‌ను రద్దు చేశారని ఆవేదన వ్యకం చేశారు. పేద ప్రజల పొట్టగొట్టి, సంక్షేమ పథకాలను రద్దు చేయడం బాధాకరమని అన్నారు. ఈ విషయంలో అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వానికి విన్నవించామని తెలిపారు. కేసీఆర్ కిట్‌ను పేరు మార్చుకున్నా తమకు అభ్యంతరం లేదని, కానీ.. పేదలకిచ్చే సంక్షేమ పథకాలకు రద్దు చేయవద్దని రేవంత్ సర్కారుకు కోరినా పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు దేవుడెరుగు, ఉన్న పథకాలను లేకుండా చేస్తున్నదని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే మాటలకు ఎక్కువ.. చేతలకు తక్కువ అని మరోసారి నిరూపించిందన్నారు. కల్యాణలక్ష్మి పథకంలో అదనంగా తులం బంగారం ఇస్తామని చెప్పి, ఇచ్చే కల్యాణలక్ష్మి లక్ష రూపాయలు ఇవ్వడం లేదని ఎద్దేవా చేశారు. వానకాలం ముగుస్తున్నప్పటికీ రైతులకు రైతుభరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసగించిందన్నారు. కాంగ్రెస్ మోసాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని, అబద్ధాల కాంగ్రెస్ నిజ స్వరూపం ప్రజలకు తెలిసిపోయిందన్నారు. కరెంట్ సరఫరా సరిగ్గా లేక మోటర్లు కాలిపోతున్నాయని, రైతులను, పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ సర్కారుకు రోజులు దగ్గర పడ్డాయని హరీశ్‌రావు అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.



దుబ్బాకలో యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథున్ని దర్శించుకున్న ఎమ్మెల్యేలను సన్మానించిన యువజన సంఘం ప్రతినిధులు